క్లుప్తంగా

ఆకట్టుకున్న డ్వాక్రా ఉత్పత్తులు



తునిలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్

తుని: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) తయారు చేసిన ఉత్పత్తులు ప్రజలను ఆకట్టుకున్నాయని మెప్మా అధికారి శ్రీదేవి తెలిపారు. మంగళవారం పాత బజారువీధి వెంకటేశ్వర స్వామి వద్ద మెప్మా బజారును ఏర్పాటు చేశారు. డ్వాక్రా సంఘాలు తయారు చేసిన పలు రకాల ఉత్పత్తులను విక్రయించారు. ప్రతి నెల పట్టణంలోని ప్రధాన సెంటర్లలో వీటిని ఏర్పాటు చేయడం ద్వారా మంచి ఆదాయం వస్తుందని శ్రీదేవి అన్నారు. ప్రజలకు అవసరమైన వస్తువులను తయారు చేయడంలో డ్వాక్రా సంఘాల సభ్యులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి సంఘాల సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

కిశోర్ బాలికల వికాసంపై అవగాహన



సదస్సుకు హాజరైన ఎంపీపీ రాము, అధికారులు

తుని: కిశోర్ బాలికల మనో వికాసానికి ఐసీడీఎస్ అధికారులు కృషి చేయాలని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము అన్నారు. తుని మండల పరిషత్ కార్యాలయంలో కిశోర్ వికాసం అనే అంశంపై ఐసీడీఎస్ తుని ప్రాజెక్టు సీడీపీవో కె.శ్రీలత అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఎంపీపీ రాము ప్రారంభించారు. బాలికల రక్షణ కోసం పోలీస్‌శాఖ కల్పించిన చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికల రక్షణ కోసం చట్టంలో కల్పించిన పలు అంశాలను ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.శ్రీనివసారావు, కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు వివరించారు. ఎంఈవో పరవాడ గీతాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర్ బాలికలు పాల్గొన్నారు.

ఐలాజ్ జాతీయ సంయుక్త కార్యదర్శిగా బుగత

ప్రత్తిపాడు: ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) జాతీయ సంయుక్త కార్యదర్శిగా ప్రత్తిపాడుకు చెందిన న్యాయవాది బుగత శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల ఒడిశా రాష్ట్రం కటక్‌లో జరిగిన ఐలాజ్ రెండో జాతీయ మహాసభలో జాతీయ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారని ఆయన మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు. జాతీయ అధ్యక్షుడిగా మైత్రేయి కృష్ణన్ (కర్నాటక), ఉపాధ్యక్షులుగా మంజుశర్మ (బీహార్), రమేష్ (తమిళనాడు), ప్రధాన కార్యదర్శిగా క్లిఫ్టన్ డి.రొజారియో (కర్నాటక)లతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి సంయుక్త కార్యదర్శిగా తనను, మరో ఇద్దరిని కార్యవర్గ సభ్యులుగా మహాసభలలో ఎన్నుకున్నారని తెలిపారు. కాగా ఈమహాసభలకు దేశం నలుమూలల నుంచి భారీ ఎత్తున ప్రతినిధులు హాజరయ్యారన్నారు.

మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడు ఎస్ సంజీవి



ప్రధానకార్యదర్శి కె.రవి

ఏలేశ్వరం: మండల యుటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూటీఎఫ్ జిల్లా ఎఫ్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్ జట్ల సోమరాజు అధ్యక్షతన స్థానిక ఎమ్మార్సీ భవనంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎస్.సంజీవి, ప్రధాన కార్యదర్శిగా కె.రవిలను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జి.సుందరరావు, ఉపాధ్యక్షుడిగా బి.రాంబాబు, మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎస్.నాగమణి, కోశాధికారిగా కె.మురళీకృష్ణ, కార్యదర్శులుగా ఓరాజు, జె.అప్పారావు, గంగాధరరావుదొర, దేవదేవి, శిరీషలతో పాటు మరో ఆరుగురిని ఎన్నుకున్నారు. మండల ఆడిటర్‌గా ఎస్.రాజు, జిల్లా కౌన్సిలర్లుగా రాజశేఖర్, గణపతిరావు, కె.రాజీవ్, కె.భాగ్యజ్యోతి, ఆదివిష్ణు, ప్రభాకరరావు, ఎస్.పద్మలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లాఅధ్యక్షుడు కేవీవీ నగేష్, జిల్లా కార్యదర్శులు పీవీఈ సత్యనారాయణ, ఎస్.వీరబాబు పాల్గొన్నారు.

బెల్లపుఊట ధ్వంసం

తుని: సారా తయారీకి వినియోగించే 6,400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తుని ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో వై.పట్టాభి చౌదరి తెలిపారు. మంగళవారం అందిన సమాచారం మేరకు తొండంగి మండలం బోడిపల్లిపేట, బుచ్చిచ్చపేట గ్రామాల్లోని జీడి తోటలో నిల్వ చేసిన బెల్లపు ఊటను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశామన్నారు. కాకినాడ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఈఎస్‌టీఎఫ్, తుని ఎక్సైజ్ ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దిపాలెంలో వెయ్యి లీటర్లు

ప్రత్తిపాడు: పెద్దిపాలెం గ్రామ శివారులలో ప్రత్తిపాడు ఎక్సైజ్ పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ కథనం మేరకు పెద్దిపాలెంలో సారా స్థావరాలపై దాడి చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన వెయ్యి లీటర్ల పులిసిన బెల్లపు ఊటపు ధ్వంసం చేశారు. నిందితులు పరారయ్యారు. ఈదాడుల్లో స్థానిక ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్ తదితర సిబ్బంది పాల్గొన్నారని సీఐ తెలిపారు.

చివరికి నష్టమే..

- అన్నదాతలను నిలువునా ముంచిన వర్షాలు
- ఏడాది కష్టం నీటిపాలు
- రంగు మారిన ధాన్యంతో రైతులు దిగాలు
- ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న రైతులు



కోటనందూరు మండలం వర్షం నీటికి తడిసి రంగు మారిన పనలను చూపుతున్న రైతు

తుని: మెట్టలో రైతులు ఎక్కువ శాతం వర్షాల మీద ఆధారపడి వరి సాగు చేస్తారు. గోదావరి డెల్టాలో రెండు పంటలు పండితే మెట్టలో ఖరీఫ్ మాత్రమే సాగువుతుంది. సకాలంలో వర్షాలు కురవక పోవడంతో వరి నారు నుంచి నాట్లు వరకు ఆలస్యం అవుతాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు ఆలస్యం కావడం, పంట కోతలు నవంబరు, డిసెంబరులో చేశారు. ఆరుగాలం కష్టం చేతికి అందివస్తుందన్న తరుణంలో వరణుడు రైతుల ఆశలపై నీళ్లపోశాడు. పంట పక్వానికి వచ్చాక ఆలస్యం చేస్తే గింజలు నేలరాలిపోయే ప్రమాదం ఉండడంతో రైతులు కోతలు కోశారు. తేమ శాతం తగ్గాలంటే వారం రోజుల సమయం ఉండాలి. తర్వాత కుప్పలు వేస్తారు. ఇంతలోనే ఆకాల వర్షాలు కురవడంతో పనలపై ఉన్న వరిధాన్యం తడిసి రంగు మారింది. అంతా బాగున్న ధాన్యాన్నే ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదు. తడిచిన ధాన్యం ఎవరికి ఎంతకు అమ్ముకోవాలో తెలియక దిక్కుతోచక రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

ఇదీ పరిస్థితి

తుని వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని తుని, తొండంగి, కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో 14,266 హెక్టార్లలో వరి సాగు చేశారు. ఇందులో 6437 హెక్టార్లలో కోతలు కోసి నూర్పులు చేశారు. బహిరంగ మార్కెట్‌లో 8019 మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయించారు. ప్రస్తుతం పనలపై 1428 హెక్టార్లు, కుప్పలు 13,252 హైక్టార్లు, కళ్లాల్లో ధాన్యం 573 మెట్రిక్ టన్నులు ఉంది. ఇది కాకుండా 758 మెట్రిక్ టన్నుల ధాన్యం రంగు మారింది. వీటిని ప్రభుత్వం తప్పా ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేసే అవకాశం లేదు. రెండు రోజులుగా అల్పపీడనం ప్రభావంతో వర్షాలు పడుతున్నాయి. దీంతో పక్వానికి వచ్చిన పంటను కోతలు చేయడానికి రైతులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం

అధికారంలోకి వస్తే వ్యవసాయాన్ని పండగ చేస్తామని కూటమి నేతలు ఊక దంపుడు ఉపన్యాశాలు చేశారు. ప్రతి రైతుకు ఏడాదికి అన్నదాత సుఖీభవ పథకంలో రూ.20 వేలు అకౌంట్‌లో వేస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వం క్రమం తప్పకుండా ఏటా రైతుల అకౌంట్‌లో కేంద్ర ప్రభుత్వ నిధులను కలిపి రూ.15 వేలు పెట్టుబడి సహాయం అందించారు. దీంతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పంటల బీమా, ధాన్యం కొనుగోళ్లు రైతు భరోసా కేంద్రాల ద్వారా చేశారు. రైతులకు అన్ని విధాలా బాసటగా నిలిచింది. ప్రస్తుత ప్రభుత్వం రైతులను గాలికి వదివేసింది. రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. పంటకు రూ.వేలల్లో పెట్టుపెడి పెట్టిన రైతులు పండిన ధాన్యాన్ని కొనే వాడు లేక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తొండంగి మండలం రైతులకు సూచనలు ఇస్తున్న ఏడీఏ బులిబాబు

అప్పు తీరుతుందనుకున్నా



వ్యవసాయాన్ని నమ్ముకుని వరి పంటకు రూ.వేలల్లో పెట్టుబడి పెట్టాను. నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశాను. బ్యాంకులు, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి రూ.1.20 లక్షలు అప్పు చేశాను. పంట పంట పండింది అప్పులు తీరిపోతాయని కొండంత ఆశలు పెట్టుకున్నాను. కోత కోసిన పంట పనలపై ఉంది. ఇదే సమయంలో వర్షాలు కురవడంతో కొంత పంటను కుప్పగా వేశాను. మిగిలిన పంట పనలపై ఉంది. వర్షం నీటికి తడవడంతో ధాన్యం రంగు మారింది. పంట చేతికి వచ్చిన సమయంలో వరుణుడు రూపంలో నష్టపోయిన నన్ను ప్రభుత్వం ఆదుకోవాలి.

– నాగేశ్వరరావు, రైతు, తుని మండలం

అధికారులకు నివేదిక



తుని వ్యవసాయ సబ్ డిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో వర్షాలకు జరిగిన నష్టాన్ని ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున్న రైతులను అప్రమత్తం చేశాం. కోటనందూరు మండలంలో 549 మెట్రిక్ టన్నులు, తుని మండలంలో 209 మెట్రిక్ టన్నుల ధాన్యం రంగు మారింది. దీన్ని ప్రభుత్వ పరంగా కొనుగోలు చేయాలి నివేదించాం. పనలపై ఉన్న వరిని కుప్పలు వేసుకోవాలని రైతులకు మండల వ్యవసాయ అధికారుల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

– సుంకర బులిబాబు, ఏడీఏ, తుని

సత్యదేవుని సన్నిధిలో కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్



సత్యదేవుని వ్రతమాచరిస్తున్న కాకినాడ కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ దంపతులు

అన్నవరం: కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, ఎస్పీ విక్రాంత్ పాటిల్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రత్నగిరిపై సత్యదేవుని వ్రతమాచరించి, స్వామివారిని దర్శించారు. ఆలయం వద్ద వారికి దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో పండితులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా, స్వామివారి ప్రసాదాలను చైర్మన్, ఈఓ అందజేశారు.

ఉపాధి పనులు పారదర్శకంగా ఉండాలి

ప్రత్తిపాడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై గ్రామాలలో పనుల నిర్ధారణ పారదర్శకంగా చేపట్టాలని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సామాజిక తనిఖీపై కోఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు మాట్లాడుతూ మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులు రూ.1174 లక్షల వేతనాలు, రూ.433 లక్షల సామగ్రికి అయిన ఖర్చుపై గ్రామాల్లో సామాజిక తనిఖీ జరుగుతుందని చెప్పారు. సోషల్ ఆడిట్ అధికారుల బృందం గ్రామాల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తారని, ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఈఓఆర్డీ కేవీవీ కాశీ విశ్వనాథం, ఏపీఓ కుమార్‌స్వామి, ఎంపీటీసీలు, సిబ్బంది హాజరయ్యారు.

పోరుబాటను జయప్రదం చేయాలి



ముద్రగడ గిరిబాబు



పోరుబాట కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు

కిర్లంపూడి: ప్రజలపై విద్యుత్ భారాన్ని తగ్గించాలంటూ ఈ నెల 27వ తేదీన చేపడుతున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే విద్యుత్ గుదిబండను ప్రజలపై మోపిందన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని మాయ మాటలు చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని పూర్తిగా పెడచెవిన పెట్టిందన్నారు. నవంబర్ నుంచి ప్రజలపై విద్యుత్ భారంమోపే పద్ధతిని కూటమి ప్రభుత్వం షురూ చేసిందన్నారు. నవంబర్‌లో రూ.6,072 కోట్లు, డిసెంబర్‌లో రూ.9,412 కోట్లు మొత్తం రూ.15,484 కోట్ల ప్రజలపై విద్యుత్ భారం పండిందని ఆయన తెలిపారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని పార్టీ చేస్తున్న పోరుబాట నిరసన కార్యక్రమానికి ప్రత్తిపాడు నియోజకవర్గంలోని విద్యుత్ వినియోగదారులందరూ పెద్ద ఎత్తున తరలి రావాలని గిరిబాబు పిలుపునిచ్చారు. విద్యుత్ వినియోగదారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, 27న ఉదయం 8 గంటలకు కిర్లంపూడిలోని తన స్వగృహానికి చేరుకోవాలన్నారు. అక్కడ నుంచి ర్యాలీగా ప్రత్తిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరుకుని నిరసన కార్యక్రమం చేయనున్నట్టు తెలిపారు.

పోరుబాట కరపత్రాల ఆవిష్కరణ

జగ్గంపేట: స్థానిక వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్ సీపీ పోరుబాట కరపత్రాన్ని ఆవిష్కరించినట్టు పార్టీ మండల అధ్యక్షుడు రావుల గణేష్ తెలియజేశారు. జగ్గంపేట కోనేటి వీధి నుంచి ఎలక్ట్రికల్ కార్యాలయం వరకు పోరుబాట నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈనెల 27న జరగనున్న ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి..

జగ్గంపేట: రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సీఐ వైఆర్కే శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం హెల్మెట్ వినియోగంపై బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతు మోటార్ సైకిల్ ప్రయాణికులు తప్పనిసరిగా హెల్మెట్ ఉపయోగించాలని, ప్రమాదవశాత్తు ప్రమాదానికి గురైనప్పటికి ప్రాణాపాయం తప్పుతుందన్నారు. జగ్గంపేట, గండేపల్లి ఎస్సైలు టి.రఘునాధరావు, యూవీ శివ నాగబాబు, మహిళా పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్‌షాపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



చింతలూరులో అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ నిరసన తెలుపుతున్న లిబరేషన్ పార్టీ కార్యకర్తలు

ప్రత్తిపాడు రూరల్: కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్‌షాపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని చింతలూరులో మంగళవారం సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా లిబరేషన్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానించే రీతిలో పార్లమెంట్‌లో అమిత్‌షా మాట్లాడడం దారుణమన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా తక్షణమే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లిబరేషన్ నాయకులు మానుకొండ లచ్చబాబు, దాడి లక్ష్మణరావు, ఆరుగుల అప్పారావు, బాలరాజు, అప్పారావు, చల్లబాబు, కాకరమ్మ, చిట్టెమ్మ, రాజమణి, కుంచే రాజు, అరక రమణ తదితరులు పాల్గొన్నారు.

హైవేపై పెను ప్రమాదం



ప్రమాదంలో రోడ్డుపై పడిన మోటారు సైకిల్, మినీ వ్యాన్



రోడ్డుపై పడిన విద్యుత్ తీగలను పక్కకు తొలగిస్తున్న పెట్రోలింగ్ సిబ్బంది

- త్రుటిలో తప్పిన ప్రాణనష్టం
- నిలిచిన ట్రాఫిక్
- ద్విచక్ర వాహనదారులకు స్వల్పగాయాలు
- టిప్పర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే అంటున్న స్థానికులు

గండేపల్లి: హైవేపై మంగళవారం ప్రమాదం జరిగింది. ఈప్రమాదంలో ప్రాణ నష్టం త్రుటిలో తప్పింది. ఈ ప్రమాదం స్థానికులతోపాటు పక్కరోడ్డులో ప్రయాణిస్తున్న వాహనదారులు, ఇతర ప్రయాణికులు భయబ్రాంతులకు గురయ్యారు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని నీలాద్రిరావుపేట పరిధి చక్రవర్తి నగర్‌కు చెందిన టిప్పర్ లారీ అదే గ్రామంలో గ్రావెల్‌ను అన్‌లోడ్ చేసి జగ్గంపేట వైపునకు వెళ్లేందుకు రోడ్డుపైకి వస్తుండగా విద్యుత్ కేవీ వైర్లు లారీకి వెనుక భాగంలో చిక్కుకున్నాయి. వాటిని తప్పించకుండా డ్రైవర్ లారీ ముందుకు పోనిచ్చాడు. తర్వాత బయట వారు కేకలు వేసి చెప్పడంతో అతను లారీని అక్కడే వదిలేసి పరారయ్యాడు. అయితే రాజమహేంద్రవరం నుంచి తుని వైపు వెళుతున్న ద్విచక్రవాహనదారుడు లారీకి తప్పించుకునే క్రమంలో నమ్మదిగా రావడంతో వెనుక వస్తున్న మినీ గూడ్స్ వ్యాన్ ఢీకొంది. దీంతో మోటారుసైకిల్‌పై ఉన్న ఇద్దరు మహిళలతోపాటు మోటారు సైకిలిస్టుకు గాయాలయ్యారు. వారిని స్థానికులు జగ్గంపేట ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదం లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా జరిగిందని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్ వైర్లు లారీకి చిక్కుకున్న సమయంలో విద్యుత్ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని, కరెంట్ ఉండుంటే ఘోర ప్రమాదం జరిగేదని తెలిపారు. ఈ ప్రమాదం కారణంగా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. ఈ ట్రాఫిక్‌ను పెట్రోలింగ్ సిబ్బంది క్రమబద్ధీకరిస్తున్న క్రమంలో అదే మార్గంలో వస్తున్న కారును ఓ లారీ ఢీకొంది. దీంతో కారుకు ముందుభాగంలో కుడి వైపు టైర్ పంచరైంది. అయితే కారులో ఉన్న ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. సంఘటన స్థలం వద్దకు చేరుకున్న సీఐ వైఆర్కే శ్రీనివాస్ జరిగిన ప్రమాదంపై కేసు నమోదు చేయనున్నట్టు తెలిపారు.

క్రిస్మస్‌కు సర్వం సిద్ధం

- ముస్తాబైన ప్రార్థన మందిరాలు
- సందడిగా మారిన గ్రామాలు
- నేడు క్రీస్తు జననం



ఏలేశ్వరంలో ముస్తాబైన ఆర్‌సీఎం చర్చి



తుని జీఎన్‌టీ రోడ్డులో ముస్తాబైన ఎస్ఎంబీ చర్చి

ఏలేశ్వరం: లోక రక్షకుడైన ఏసుక్రీస్తు జన్మదినాన్ని బుధవారం ఘనంగా జరుపుకొనేందుకు ప్రార్థనా మందిరాలు ముస్తాబయ్యాయి. క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవులందరూ అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని మంగళవారం చర్చిలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. చర్చిలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రార్థన మందిరాల వద్ద బెత్లెహాం నగరంలో పశువులపాకలో క్రీస్తు జన్మించాడనే సూచికగా గడ్డితో చేసిన పాకలో బాల యేసు విగ్రహాలను ఏర్పాటు చేశారు. క్రీస్తు రాకను పురస్కరించుకుని ఇళ్ల వద్ద రంగురంగుల స్టార్లను ఏర్పాటు చేశారు. పట్టణంలోని లూథరన్, ఆర్‌సీఎం, సీఓఎం చర్చిలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. క్రీస్తు పుట్టుకను పురస్కరించుకుని అర్థ రాత్రి నుంచి ప్రార్థనలు ప్రారంభించారు. క్రైస్తవులందరూ బైబిల్‌ను చదువుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని ఏలేశ్వరం, లింగంపర్తి, యర్రవరం, సిరిపురం తదితర గ్రామాల్లో క్రిస్మస్‌సంబరాలు ఘనంగా జరుపుకోనున్నారు.

ఆకట్టుకున్న పశువుల పాక సెట్టింగ్‌లు

క్రీస్తు జన్మదినానికి సూచికగా చర్చిల ఆవరణలో ఏర్పాటు చేసిన పశువుల పాక సెట్టింగ్‌లు ఆకట్టుకున్నాయి. బాలయేసు పాకలో జన్మించినట్టుగా సెట్టింగ్‌లు వేశారు. చర్చిలను విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఏలేశ్వరంలో నూతనంగా నిర్మించిన ఆర్‌సీఎం చర్చిను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న లూథరన్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

గోకవరంలో..

గోకవరం: ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగకు జగ్గంపేట నియోజకవర్గంలోని చర్చిలు సుందరంగా ముస్తాబయ్యాయి. క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు గోకవరం మండలంలోని అన్ని చర్చిల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. గోకవరంలోని సెయింట్‌జాన్స్ లూథరిన్ చర్చి, కృష్ణునిపాలెంలో ఈహెచ్‌హెచ్ చర్చి, రంపయర్రంపాలెంలో సెయింట్‌జాన్స్ లూథరన్ చర్చి, తంటికొండ, కొత్తపల్లి, కామరాజుపేట, గాదెలపాలెం, ఇటికాయలపల్లి, అచ్యుతాపురం తదితర గ్రామాల్లోని చర్చిలు విద్యుద్దీపాలతో కళకళలాడుతున్నాయి. ఆయా చర్చిలలో మంగళవారం రాత్రి నుంచి ప్రత్యేక కార్యక్రమాలు, ప్రార్థనలు నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని ఆయా చర్చి పాస్టర్లు తెలిపారు.

తునిలో..

తుని: పట్టణంలోని బాప్టిస్టు చర్చితో పాటు పలు చర్చిలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. మంగళవారం సాయంత్రం సెమీ క్రిస్మస్‌ను పురస్కరించుకొని శాంతాక్లాజ్‌లు, క్రీస్తు జననం వివరించే కళాకృతులను ఏర్పాటు చేశారు. ఈ లోకంలో మానవ రక్షనార్థం క్రీస్తు జన్మించడాన్ని క్రైస్తవుల నమ్మకం. భక్తులు తమకు తోచిన రీతిలో దేవునికి కానుకులు సమర్పించి, పేదలకు దానం చేస్తారని సంఘ కాపరి తెలిపారు.

ప్రత్తిపాడులో...

ప్రత్తిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాత్రి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ ఎం.సూర్యప్రభ కేక్‌ను కట్ చేసి, వేడుకలను ప్రారంభించారు. రెవెన్యూ సిబ్బంది క్రిస్మస్ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎ.గోపాలకృష్ణ, సర్వేయర్ బషీర్ తదితర కార్యాలయ సిబ్బంది, సచివాలయ సర్వేయర్లు, గ్రామ పరిపాలనాధికారులు, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీరమణి

కోటనందూరు: భూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు పెద్దాపురం ఆర్డీఓ కే శ్రీరమణి తెలిపారు. కేఓ అగ్రహారంలో జరిగిన రెవెన్యూ సదస్సును మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పల్లెల్లో దశాబ్దాలుగా మూలుగుతున్న భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. విస్తీర్ణంలో తేడాలు, ఆన్‌లైన్‌లో భూమి కనిపించకపోవడం, సరిహద్దు తగాదాలు తదితర సమస్యలపై సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సదస్సులో వచ్చిన అర్జీలపై సమగ్ర విచారణ చేపట్టి సమస్యలను పరిష్కరిస్తారన్నారు. తహసీల్దార్ టీ శుభాష్, డీటీ పీవీవీ సత్యనారాయణ, వీఆర్వో రాజాశంకర్, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడి, చినశంకర్లపూడి గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో రైతులకు పరిష్కారం చూపుతామని తహసీల్దార్ ఎం సూర్యప్రభ చెప్పారు. గ్రామాల్లో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈసదస్సుల్లో 1బి కోరిన రైతులకు 1బీ పత్రాలను అక్కడికక్కడే అందజేశారు. సదస్సుకు ఆరు అర్జీలు అందాయి. రెవెన్యూ ఇనస్పెక్టర్ ఎ.గోపాలకృష్ణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు సూర్నీడి సురేష్, ఏపూరి రామారావు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఆంధ్ర, తెలంగాణ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

ఏలేశ్వరం: సహకార సంఘాల బలోపేతానికి కృషి చేయాలని సహకార సంఘాల తెలుగు రాష్ట్రాల సమన్వయ కర్త డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయంలో మంగళవారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 1.03 లక్షల నూతన మల్టీపర్పస్ పీఏసీఎస్‌లు, 1.06 లక్షల పాల ఉత్పత్తిదారుల సంఘాలు, 11 వేల ఫిషరీస్ సహకార సంఘాలు ఉన్నాయన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంఘాల ఏర్పాటు చేయనున్నారు. అనంతరం కేంద్ర సహకార మంత్రిత్వశాఖ తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్రాల పరిధిలో సహకార బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మేనేజర్ రవికుమార్, సూపర్‌వైజర్ నాగేంద్ర, సీఈఓ జ్యోతుల నాగసత్యశ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతమే లక్ష్యం

ప్రత్తిపాడు రూరల్: సహకార సంఘాల బలోపేతానికి కార్యచరణ సిద్ధం చేస్తున్నట్టు కేంద్ర సహకార మంత్రిత్వశాఖ ఆంధ్ర, తెలంగాణ కోఆర్డినేటర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాసరావు వెల్లడించారు. మండలంలోని ఒమ్మంగి, లంపకలోవ సోసైటీలలో మంగళవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీబీ ఏజీఎం శ్రీనివాసరావు, మేనేజర్ కె.రమణ, హెడ్ ఆఫీస్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వెదజల్లు పద్ధతిలో సాగు లాభదాయకం

శంఖవరం: వరి వెదజల్లు పద్ధతిలో సాగు లాభదాయకం అని వ్యవసాయశాఖ అధికారి గాంధీ రైతులకు సూచించారు. నెల్లిపూడిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి దమ్ము చేసే పద్ధతులను రైతులతో కలిసి పరిశీలించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీనివాస్, మౌళిప్రసాద్, ఆత్మ ఏటీఎం బాబూరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

మండల శాఖ యూటీఎఫ్ అధ్యక్షుడిగా కోడి



కోడి శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: స్థానిక మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) అధ్యక్షుడిగా కోడి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన మండల యూటీఎఫ్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షుడిగా ఆర్. సూర్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్.నాగేశ్వరరావు, అసోసియేట్ మహిళా అధ్యక్షురాలిగా సీహెచ్ సూర్యావతి, ప్రధాన కార్యదర్శిగా డి.రాజబాబు, కోశాధికారిగా ఎం వీ రమణ, కుటుంబ సంక్షేమ డైరెక్టర్‌గా వి.రవితేజా, పత్రికా సంపాదకుడిగా ఎం .రమేష్, ఆడిటర్‌గా ఎం .స్వామి కుమార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు నగేష్, ప్రసాద్‌బాబు, చుక్కల లక్ష్మీ గణేష్, వీవీ రమణ, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ రాపర్తి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో ఏఐ టూల్స్ ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో జరుగుతున్న ఏఐ టూల్స్ ఆన్‌లైన్ సర్టిఫికేషన్ కోర్సు ఈ నెల 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. జనరేటివ్ ఏఐ, టెక్స్ట్ బేస్ట్ ఏఐ, ఇమేజ్ ఏఐ, ఆడియో ఏఐ వంటి ఆధునిక టూల్స్ పై డి.నాగతేజ్ ఉపన్యాసం ఇచ్చినట్టు తెలిపారు. సాయంత్రం గం.6 నుంచి గం.7.30 వరకూ నిర్వహించే ఈ కార్యక్రమంలో వివిధ ఆధునిక ఏఐ టూల్స్‌పై విస్తృత అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ ఎస్.రమాశ్రీ, జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.